క్లుప్తంగా

అన్నదానం



అన్నదానం చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

చుంచుపల్లి: తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యానగర్‌కు చెందిన వాసిరెడ్డి మురళి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆదివారం జ్యోతి అనాథ వృద్ధుల ఆశ్రమంతో పాటు సత్యసాయి సేవా సమితిలో చిన్నారులకు అన్నదానం, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. వాసిరెడ్డి మురళి, కొల్లు నాగేశ్వరరావు, సెక్రటరీ సురేష్ కుమార్, పాండురంగారావు, ధర్మారావు, రాజేంద్రప్రసాద్, కామేశ్వరరావు, మైనేని నాగేశ్వరరావు, వాసిరెడ్డి ప్రసాద్, లక్ష్మి, గీత, స్థానికులు కందిమళ్ల రామారావు, బాగం మహేశ్వరరావు, వేలాద్రి పాల్గొన్నారు.

విద్యుత్ టవర్ గుంత పూడ్చివేత

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచ: పట్టణంలోని కేఎస్‌పీ రోడ్‌లో విద్యుత్ లైన్ టవర్ గుంతను ఎట్టకేలకు కాంక్రీట్‌తో పూడ్చివేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ లైన్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా నెల రోజుల క్రితం రోడ్డు పక్కన 11 అడుగుల గుంత తవ్వి వదిలేశారు. శనివారం ఆ గుంతలో ఆవు పడిపోవడంతో స్థానికుల సహకారంతో బయటకు తీశారు. ఈ విషయాన్ని సాక్షి పత్రికలో ఆదివారం 'గుంతలో జారిపడిన గోవు' వార్తను ప్రచురించింది. కాంట్రాక్టర్ స్పందించారు. గుంతలో విద్యుత్ పోల్స్‌ను పాతి కాంక్రీట్‌తో పూడ్చివేశారు.

ప్రధానిపై విమర్శలు తగవు



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

పాల్వంచరూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీని విమర్శించే స్థాయి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు లేదని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పనులకు శంకుస్థాపనలు చేసుకుంటూ కేంద్ర ప్రభుత్వాన్నే విమర్శించడం తగదరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాసమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంటే ఎందుకు విమర్శించడం లేదన్నారు. దేశంతోపాటు రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీ ఉనికి కోల్పోతోందన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో ఖమ్మం నియోజకవర్గంలో బీజేపీని గెలిపించి మోదీకి బహుమతిగా ఇస్తామన్నారు. సమావేశంలో పానిశెట్టి వెంకటేశ్వర్లు, రాపాక రమేష్, లట్టి మురళి, మనుపురి ప్రభాకర్, గంధం ప్రసాద్‌గౌడ్, రవినాయక్, రంజిత్, లక్ష్మణ్, నరేష్, వంశీ పాల్గొన్నారు.

వైభవంగా రాధాకృష్ణుల కల్యాణం



రాధాకృష్ణుల కల్యాణ వేడుకలో భక్తులు

ఇల్లెందురూరల్: నాయకులగూడెం, కొల్లాపురం గ్రామాలలో సంప్రదాయబద్ధంగా రాధాకృష్ణుల కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రతీఏటా ఫాల్గుణమాసం పౌర్ణమి రోజున రాధాకృష్ణుల కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. నాయకులగూడెం ఆలయంలో కొలువుదీరిన రాధాకృష్ణులకు పూజ చేసి డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా ఉత్సవ విగ్రహాలను కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చారు. ఆలయ పురోహితులు శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్చారణలతో రాధాకృష్ణుల కల్యాణం నిర్వహించారు. కల్యాణ వేడుకలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కొల్లాపురం గ్రామంలో వీరమ్మ అనే మహిళ శ్రీకృష్ణునిపై భక్తితో స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

బోనాల చెల్లింపు...

రాధాకృష్ణుల కల్యాణం సందర్భంగా కొమరారం గ్రామాలలో భక్తులు గ్రామస్తులు దేవతామూర్తులకు ఆదివారం బోనాలు చెల్లించారు. ఆలయ ప్రధాన పూజారి కోరం కోటమ్మ బోనాలకు ఎదురేగి స్వాగతించారు. రాధాకృష్ణులకు బోనాల చెల్లింపుతో కల్యాణ వేడుకలను ప్రారంభించారు. అంతకుముందు గ్రామంలో పలు కటుంబాలు సిద్ధం చేసిన తలంబ్రాల బియ్యాన్ని మేళతాళాలతో ఆలయానికి తీసుకొచ్చారు. గ్రామపెద్దలు భారీగా తరలివచ్చి ఆలయ ప్రాంగణమంతా మామిడితోరణాలతో అలంకరించారు. వేడుకలు ప్రారంభం కావడంతో కొమరారం గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.



తలంబ్రాల బియ్యం తీసుకొస్తున్న భక్తులు

ఉత్పత్తి, ఉత్పాదకతకు సహకరించండి



జీఎం శాలేంరాజుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం చేపట్టు వార్షిక ఉత్పత్తి, ఉత్పాదకతకు గుర్తింపు కార్మిక సంఘం సహకరించాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు కోరారు. ఆదివారం కొత్తగూడెం ఏరియాలో ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ కొరిమి రాజ్‌శేఖర్ ఆధ్వర్యంలో యూనియన్ ఆఫీస్ బేరర్లను జీఎంకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పట్ల, చట్టాల పట్ల పూర్తి అవగాహన ఉండి సుదీర్ఘకాలంగా సింగరేణి సంస్థ అభివృద్ధిలో ఎన్నో ఎళ్లుగా తోడ్పాటు అందిస్తున్న ఏఐటీయూసీకి శుభాకాంక్షలు తెలిపారు. ఇండస్ట్రియల్ రిలేషన్స్ కాపాడుతూ ఉత్పత్తి, ఉత్పాదకలో సంస్థ ముందుకెళ్లేందుకు గుర్తింపు సంఘ సభ్యులు సంస్థకు తోడ్పాటు అందించాలన్నారు. కార్మిక సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని చెప్పారు. వీకే–7టీసీ త్వరలో ప్రారంభం కానుందని, అప్పుడు కొత్తగూడెం ఏరియా తిరిగి కార్మికులతో పూర్వవైభవంతో కళకళలాడుతుందన్నారు. అనంతరం యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ మాట్లాడుతూ... సంస్థలో సుదీర్ఘకాలంగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తమ యూనియన్ పనిచేస్తోందని, ఎన్నో కార్మిక హక్కులు సాధించిన చరిత్ర గల ఏఐటీయూసీని గెలిపించిన కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి అధికారుల సహకారం అందించాలని కోరారు. కొత్తగూడెం ఏరియాలో ఏఐటీయూసీ నాయకలకు అధికారులు అభినందనలు తెలిపారు. కొత్తగూడెం కేంద్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి.వీరస్వామి, ఏరియా బ్రాంచ్ కార్యదర్శి వట్టికొండ మల్లికార్జున్, సహాయ కార్యదర్శి జి.గట్టయ్య, ఉపాధ్యక్షులు కత్తెర్ల రాములు, ఆఫీస్ బేరర్లు సందెబోయిన శ్రీనివాస్, హుమాయిన్, గుమ్మడి వీరయ్య, మెంగెన్ రవి, మధుకృష్ణ, కుర్రు రమేష్, హీరాలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచ: పట్టణ పరిధిలోని గుడిపాడు గ్రామంలో శ్రీ మోక్ష వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మోక్ష వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో కోలాట నృత్యాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కల్యాణ మహోత్సవంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఆలయ నిర్మాణ దాత, శ్యామలా గోపాలన్ ఫౌండేషన్ చైర్మన్ నల్లా సురేశ్ రెడ్డి, దమ్మపేట జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వర్లు, సందపట్ల శ్రీనివాసరెడ్డి, పెద్దమ్మగుడి ఈఓ సుదర్శన్, ఆలయ కమిటీ అధ్యక్షులు ప్రశాంత్ పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



విందులో పాల్గొన్న ముస్లింలు

జూలూరుపాడు: స్థానిక జామా మజీద్‌లో ఆదివారం రాత్రి ముస్లింలకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో వెంగన్నపాలెం ఎంపీటీసీ సభ్యుడు దుద్దుకూరి మధుసూదన్ రావు, జామా మజీద్ ప్రెసిడెంట్ ఎస్కే యాసిన్, మతగురువు మౌలాసాహెబ్, కాంగ్రెస్ నాయకులు యల్లంకి చిన్న నాగేశ్వరరావు, నర్వనేని పుల్లారావు, యల్లంకి పుల్లయ్య, వేల్పుల నరసింహారావు, శ్రీను, జోగారావు, కృష్ణయ్య, మర్రి నరసింహారావు, ముస్లింలు ఎస్కే ఆరిఫ్, ఎస్కే మైబూ, ఎస్కే ఖాసీం, ఎస్కే కరీముల్లా, నాగుల్‌మీరా, ఎస్కే రఫీ, ఎస్కే సిద్దిక్, ఎస్కే లతీఫ్ పాల్గొన్నారు.

వీధిలైట్ల ఏర్పాటు



లైట్ల ఏర్పాటును పరిశీలిస్తున్న కౌన్సిలర్

ఇల్లెందు: ఏడాదిగా వార్డుల్లో వీధి లైట్లు లేక పలు వీధులు అంధకారంలో మగ్గుతున్నాయి. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య సహకారంతో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు పలు వార్డుల్లో 300 వీధిలైట్లు ఏర్పాటు చేస్తున్నారు. వారంరోజులుగా లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. కమిషనర్ యాదగిరి, డీఈ నవీన్‌ల పర్యవేక్షణలో ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది లైట్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేశారు.

సెల్ కంపెనీపై కొనుగోలుదారుడి విజయం

టేకులపల్లి: టేకులపల్లి మండల కేంద్రానికి చెందిన గాడిపల్లి శ్రీకాంత్ రెండు నెలల క్రితం కొత్తగూడెంలోని ఓ మొబైల్ షాపులో రెడ్ మీ 9 ఫోన్ కొనుగోలు చేశాడు. దానికి దుకాణదారుడు సంవత్సరం వారంటీ ఇచ్చాడు. రెండు నెలలకే ఆ ఫోన్ పని చేయడం లేదు. దీనిపై దుకాణ యజమానిని సంప్రదించగా కంపెనీ యొక్క ఫోన్ రిపేరు సెంటర్‌కు వెళ్లమని సూచించారు. అక్కడికి వెళ్లి మొబైల్ ఫోన్ అందజేయగా ఐదుసార్లు రిపేరు చేసినా, నెలల తరబడి తిరిగినా వాడుకలోకి రాలేదు. కంపెనీ సెల్లు ప్రతినిధులతో మాట్లాడగా.. సరైన సమాధానం చెప్పకపోగా సర్వీస్ సెంటర్ చుట్టూ పలుమార్లు తిరిగిన ప్రయోజనం ప్రయోజనం లేకపోయింది. దీంతో విసుగు చెందిన శ్రీకాంత్ న్యాయవాది మల్లెంపాటి కృష్ణ సహాయంతో ఖమ్మం వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదును విచారించి బాధితుడికి న్యాయం చేశారు. కంపెనీ యాజమాన్యం బాధితుడికి రూ.26వేలు ఇవ్వవలసిందిగా సదరు కంపెనీకి ఆదేశాలు జారీ చేసింది. దీనిపై బాధితుడు సంతోషం వ్యక్తం చేశారు తనకు సహకరించిన న్యాయవాదికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

టేకులపల్లి: కార్మికులకు నెలవారీ ఇన్సెంటివ్ పునరుద్ధరించాలని, కేటీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచి కార్యదర్శి ఎండీ నజీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం యూనియన్ ఆధ్వర్యంలో పీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఇన్‌చార్జ్ మేనేజర్ కేఎస్ఎన్ రాజుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ... సింగరేణికే తలమానికంగా నిలిచిన కేటీసీ అధిక లాభాలను ఆర్జిస్తూ కార్మికుల సమస్యలపై యాజమాన్యం చిన్నచూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.600 కోట్ల లాభాలు వస్తున్న కేటీసీలో కార్మికులకు నెలవారీ ఇన్సెంటివ్ లేకపోవడం దారుణం అన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొంగర వెంకటేశ్వర్లు, బీసీ సంఘం ఉపాధ్యక్షులు ఎస్వీఎస్ఎన్ రాజు, పిట్ సహాయ కార్యదర్శి షేక్ సర్వర్, వెంగళ రవి, సామల శ్రీనివాస్, పవన్ కుమార్, వెంకటప్పయ్య, కనకరాజు, భాస్‌సింగ్, కిషోర్, జాన్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి..



మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: ఎన్నికల కోడ్ అమలులో ఉందని, అందరూ నిబంధనలు పాటించాలని లేదంటే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని, ఒక్కసారి ఎన్నికల కేసులో బుక్ అయితే ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆ కేసులో ఉన్న వారిని పిలిచి నిఘా, పర్యవేక్షణ నిరంతరం ఉంటుందని డీఎస్పీ ఎస్.చంద్రభాను అన్నారు. ఆదివారం ఇల్లెందులోని ఐతా ఫంక్షన్ హాల్‌లో రాజకీయ పార్టీల నేతలతో ఇల్లెందు సీఐ టి.కరుణాకర్ ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే సమస్యాత్మక గ్రామాలు, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తించినట్లు చెప్పారు. వాటిపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. రౌడీ షీటర్లు, అసాంఘిక శక్తుల కదలికల మీద నిఘా తీవ్రతరం చేశామని, అందరికీ కౌన్సెలింగ్ నిర్వహించామని తెలిపారు. సరిహద్దుల గుండా అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎవరైనా రూ.50 వేలకు పైగా నగదు తీసుకెళ్లొద్దన్నారు. కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, పాకాల కొత్తగూడెం, గుండాల రోడ్‌లో నిరంతరం తనిఖీలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలో రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రచారంలో ఇతర పార్టీలను దూషించటం, వ్యక్తిగత దూషణలకు పాల్పడటం, వాట్సాప్‌లో పోస్టింగ్‌లు పెట్టడటం, విద్వేశ ప్రచారం చేయటం నేరం అన్నారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలు నేతలు పాల్గొన్నారు. అనంతరం సీపీఆర్ పద్ధతి ద్వారా ఓ రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుడిని కాపాడిన నాగరాజు అనే కానిస్టేబుల్‌ను సత్కరించారు.

మామిడిగూడెంలో తిరుపతమ్మ జాతర



తిరుపతమ్మకు పూజ చేస్తున్న పూనెం వంశీయులు

ఇల్లెందురూరల్: పూనెం వంశస్థుల ఇలవేల్పు తిరుపతమ్మ అమ్మవారి జాతరను మండలంలోని మామిడిగూడెం గ్రామ శివారు అటవీ ప్రాంతంలో తిరుపతమ్మ ఆలయం వద్ద ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామం నుంచి పూనెం వంశీయులు భారీ సంఖ్యలో అమ్మవారిని స్మరిస్తూ మేళతాళాలతో ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయంలో కొలువుదీరిన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయబద్ధంగా నైవేద్యం సమర్పించారు. అనంతరం గిరిజన సంప్రదాయ నృత్యాలతో భక్తిగీతాలు ఆలపించి అమ్మవారి ప్రసన్నం కోసం తపించారు. గ్రామం చల్లంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో పూనెం రామకృష్ణ, పూనెం రామనాథం, పూనెం తిరుపతమ్మ, పూనెం భద్రమ్మ, పాయం గోపాల్, పూనెం గోపాల్, తాటి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో 'మట్టల' పండుగ



ఇల్లెందు: ప్రదర్శనలో పాల్గొన్న క్రైస్తవులు



కొత్తగూడెంరూరల్: ర్యాలీలో క్రైస్తవులు



పాల్వంచ: సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో...

ఇల్లెందు: క్రీస్తు పట్ల విశ్వాసం గొప్పదని సెయింట్ జాన్ మొయిన్ చర్చి చైర్మన్ ఫ్రాంక్లిన్ అన్నారు. ఆదివారం భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం పర్వదినం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో తాటిమట్టలతో పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. మాట్లాడుతూ... సిలువపై క్రీస్తు మరణించటానికి ముందు ఆనాటి కాలంలో ప్రజలను చైతన్యం చేసేందుకు ప్రజల మనుసులో తనపై ఉన్న అభిప్రాయం తెలుసుకునేందుకు దేవుని రాజ్యమును రాజుగా తనను తాను ప్రకటించుకున్న శాంతి సమాధాన స్థాపన సందర్భంగా ఈత, ఖర్జూర మట్టలతో ఊరేగింపు పాదయాత్ర చేపట్టారని చెప్పారు. ఏసురత్నం, అబ్బూరి సునీల్, పూలరతన్, రవి, సామ్రాజ్యం, భాగ్యమ్మ, పుష్ప, మేరీ, సుందరీ ప్రభాకర్, గిరి కుమార్, మాణిక్యమ్మ, సాగర్, ధన్‌రాజ్, చంద్రప్రకాష్, చార్లేస్ పాల్గొన్నారు.

టేకులపల్లి: మండలంలో క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. సులానగర్, మాలపల్లి, కోయగూడెం, బేతంపూడి, గంగారం, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు, మద్రాస్‌తండా తదితర గ్రామాల్లో ఈత మట్టలతో ఊరేగింపు నిర్వహించారు.

పాల్వంచ: గుడ్ ఫ్రైడే మాసం సందర్భంగా ఆదివారం పట్టణంలో చర్చిల్లో మట్టల ఆదివారం పండుగ నిర్వహించారు. ఈత మట్టలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఎస్ఐ, ఎల్‌జీఎం చర్చీల భక్తులు పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: పట్టణంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. బేతస్థ ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ సన్ని, పాస్టర్ విజయమ్మ శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: క్రైస్తవులు ఉపవాస దీక్షలు ప్రారంభించి 36 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా జరుపుకునే జయప్రవేశ పండుగ (మట్టల ఆదివారం)ను ఆదివారం మండలంలోని పలు చర్చిలలో ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాలలో నిర్వహించిన ప్రదర్శనలో క్రైస్తవులు డేవిడ్ రాజు, దయానంద్, సబస్టీన్, సూర్యప్రకాష్, ఇమ్మానియేలు, రవి, సామ్యూల్, తోకల ప్రసూన, రోజా, శాంతారావు, జయరాజు, యోహాన్, మల్లిపెద్ది జాన్‌బాబు, మధు తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: జూలూరుపాడు న్యూకాలనీ సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తును రాజుగా భావించిన ప్రజలు గాడిదపై ఏసును కూర్చోబెట్టి ఈత, ఖర్జూర మట్టలతో ఆనందంతో ఊరేగిస్తారు. దీంతో ఆ రోజును మట్టల ఆదివారంగా క్రైస్తవులు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా సీఎస్ఐ చర్చి పాస్టర్ సీహెచ్ సామ్యేలు, క్రైస్తవులు ఈత మట్టలతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి కమిటీ సెక్రటరీ అబ్రహం, రాంబాబు, కళ్లోజి భాస్కర్, ఇల్లంగి దేవసహాయం, కాశిమల్ల కిరణ్, బుడిపూడి ప్రభాకర్, ఇంజం మాణిక్యం, కాంతారావు పాల్గొన్నారు.

ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో..

ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం సందర్భంగా మట్టలతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం చర్చిలో ఫాదర్ బందనాథం శౌరీ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



టేకులపల్లి: సులానగర్‌లో...



ఇల్లెందురూరల్: మామిడిగూడెంలో...



జూలూరుపాడు: సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో

పీహెచ్‌సీలో అప్‌గ్రేడ్ ఎప్పుడో?

- నరిపడా వైద్యులు, సిబ్బంది లేక ఇక్కట్లు
- సాయంత్రం ఐదు దాటితే వైద్యం కోసం పరుగులు



సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

సుజాతనగర్: సుజాతనగర్ పీహెచ్‌సీలో 24 గంటలు సేవలందించే ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసినట్లు ప్రకటన వెలువడగానే మండలవాసులు ఆనందపడ్డారు. ఎప్పుడు ఏ ఆపద వచ్చినా వైద్యం అందుతుందని, జిల్లా కేంద్రానికి పరుగులు తీయాల్సిన పనిలేదని సంతోషం వ్యక్తం చేశారు. కానీ అది అమలుకాకపోవడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. మండల కేంద్రంలోని ఆస్పత్రిలో గతంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యసేవలు అందేవి. ఈ ఆస్పత్రి చుంచుపల్లి, సుజాతనగర్ మండలాల పరిధిలో విస్తరించి ఉండగా.. ఆయా మండలాల్లోని 60 గ్రామాల ప్రజలకు వైద్యం అందించాల్సి ఉంటుంది. దీంతో పీహెచ్‌సీలో 24 గంటల పాటు వైద్యం అందించనున్నట్లు గత ఏడాది ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కానీ ఆ ఉత్తర్వులు అమలుకు నోచుకోలేదు.

సౌకర్యాలు కరువు..

సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 24 గంటల ఆస్పత్రిగా ప్రకటించిన అధికారులు అందుకు తగినట్లుగా సిబ్బందిని నియమించ లేదు. ఒక స్టాఫ్ నర్స్, నైట్ వాచ్‌మెన్, కాంటినెంట్ వర్కర్ నియామకాలు జరగాల్సి ఉంది. ఇక 108 వాహనాన్ని భద్రపరిచేందుకు షెడ్ నిర్మించ లేదు. దీంతో ఆరోగ్య సేవల్లో మేటిగా నిలిచి కాయకల్ప, ఎన్క్వాస్ అవార్డులు దక్కించుకున్న ఈ ఆస్పత్రికి వచ్చే వారికే కాక విధులు నిర్వర్తించే ఉద్యోగులకూ తిప్పలు తప్పడం లేదు.

వైద్యులు, సిబ్బంది నియామకం ఏది?

ఆస్పత్రిలో ఇద్దరు రెగ్యులర్ వైద్యులకు గాను ఒక్కరే ఉన్నారు. మరో వైద్యుని పోస్టు ఎన్నో రోజులుగా ఖాళీగానే ఉంటోంది. ఆస్పత్రి పరిధిలో సుజాతనగర్, వేపలగడ్డ, సీతంపేట, పాత అంజనాపురం, సర్వారం, సింగభూపాలెం, విద్యానగర్-1, విద్యానగర్-2, బాబూక్యాంప్, రాంనగర్, చుంచుపల్లి, ఏబీ నగర్.. ఇలా 12 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. ఆరోగ్య ఉపకేంద్రాల్లో సైతం మొదటి, రెండో ఏఎస్ఎంల కొరత చాలా కాలంగా వేధిస్తోంది. చాలా చోట్ల ఏఎస్ఎంలు సరిపడా లేక వైద్యం అందటం లేదు. పీహెచ్‌సీ పరిధిలో 50 వేల వరకు జనాభా ఉండగా.. ఆరు పడకలే ఉండటంతో వైద్యం అందించడం ఉద్యోగులకూ కష్టమవుతోంది. అయితే, జూలూరుపాడులో 32 పడకలు ఉండగా.. సమీపానే జిల్లా కేంద్రం కొత్తగూడెం కూడా ఉండడంతో సుజాతనగర్ ఆస్పత్రిలో పడకలు పెంచడం లేదని తెలుస్తోంది. ఏదిఏమైనా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బందిని సరిపడా నియమించి 24 గంటల పాటు వైద్యం అందేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సిబ్బందిని నియమించాలి...



24 గంటల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసినా అందుకు తగ్గట్టు సిబ్బందిని నియమించ లేదు. దీంతో ఫలితం లేకుండా పోయింది. ఎక్కువగా గిరిజనులున్న ప్రాంతమిది. జ్వరాలు, ఇతర వ్యాధులు, ప్రమాదాల బారిన పడినవారు చికిత్స కోసం వస్తుంటారు.

– కత్తి బాలకృష్ణ, సుజాతనగర్

వైద్యులు అందుబాటులో ఉండాలి...



గ్రామాల్లోని సబ్ సెంటర్లలో ఏఎస్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేస్తే ఇబ్బంది ఉండదు. అధికారులు ఈ విషయాన్ని గుర్తించి వైద్యులు అందుబాటులో ఉండేలా చూస్తూ ప్రజలు వ్యాధుల బారిన పడకుండా వైద్య సిబ్బందిని నియమించాలి.

– బాదావత్ రాంకుమార్, సీతంపేట బంజర

ప్రభుత్వానికి నివేదిక పంపించాం..



24 గంటల ఆస్పత్రికి కావాల్సిన సిబ్బందిని నియమించాల్సి ఉంది. సిబ్బంది నియామకం జరగగానే 24 గంటలపాటు వైద్యసేవలు అందుతాయి. ఏఎస్ఎంల ఖాళీల విషయమై ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. ఉత్తర్వులు రావాల్సి ఉంది.

– డాక్టర్ రమేష్, వైద్యాధికారి